"ఎక్కడున్నా వాడుండకూడదు- వాడు ప్రాణాలతో బ్రతికుంటే నా పదవి పోతుంది ఆ తర్వాత పరువు పోతుంది... ఆనక నాకు, నా తర్వాత నీకు పుట్టగతులుండకుండా పోతాయి" తోక తొక్కిన త్రాచులా ఎగిరిపడ్తున్నాడు అప్పారావు.

"అయితే ఆ రామసూరిగాడ్ని లేపేయమంటారా?" హరి ఉద్రేకంగా అడిగాడు.

"దానివలన ఒరిగేదేంటి?" విసుక్కున్నాడు.

"న్యూస్ ఆగిపోతుంది."

"వాడబ్బ మరోడొస్తాడు" అసహనంగా పచార్లు చేస్తూ "నా శత్రువు వాడు కాదు... ఇపుడు ఆ నానీగాడు, వాడి చేతిలో రీలు-వాడు దొరికితే పత్రికలింకా విజృంభిస్తాయి. ప్రతిపక్షాలు పేట్రేగిపోతాయి. అసెంబ్లీలో నా పరిస్థితి బెంబేలయిపోతుంది. ఆనక చేసేదేమీ లేక చీఫ్‌మినిష్టర్ ఓ కమిటీని వేసి నన్ను నవ్వుల పాల్జేస్తూ తన నిజాయితీని నిరూపించుకుంటాడు. కాబట్టి అర్జంటుగా వాడ్ని చంపేయాలి".

"వెధవ జాతకం గట్టిదిలాగుంది. రెండుసార్లూ తప్పించుకున్నాడు."

"ఇక తప్పించుకోకూడదనే నేననేది" ఈసారి గెస్ట్‌హౌస్ దద్దరిల్లేట్లు అరిచాడు "వాడు చిక్కాల్సింది మనచేతుల్లో. దూరంగా పారిపోతున్నాడని ఆలోచించకు... కాల్చిపారేయ్ -ఆనక ఆ విషయం నా కొదిలెయ్... పోలీసు డిపార్టుమెంటులో వున్నది చాలా మంది నా మనుషులే కాబట్టి ఆ సంగతి నేను చూసుకుంటాను."

"ఈ రోజు ఎలాగన్నా-"

"రోజు కాదు. గంటల్లో వాడి పని పూర్తి కావాలి. పేపర్లో ఫోటో కూడా వేశాడుగా- కావాలంటే నీ గేంగుకి వంద పేపర్లు కొనిచ్చి ఆ ఫోటోతో పట్నమంతా గాలించమను. వ్యవధి లేదు. ఇంకా నిలబడ్డావేం.... అది చేసేదాకా నీ ముఖం చూపించకు. వెళ్లు" అప్పారావు కాలు గాలిన పిల్లిలా చిందులు తొక్కుతుంటే హరి ఆశ్చర్యంగా చూశాడు.

ఇంతకంటే చాలా గొప్ప ఘాతుకాలు తన చేత చేయించిన అప్పారావు ఈ విషయంలో ఇలా హైరానా పడిపోవడం హరికీ విడ్డూరంగా వుంది.

వెళ్ళి జీప్‌లో కూర్చున్నాడు.

హరి వెళ్ళిన రెండు నిముషాలకి పడక గదిని చేరుకున్న అప్పారావు కామేశ్వరి కార్యక్రమంలోకి దిగబోతుంటే "ఇప్పుడొద్దు. అర్జెంటుగా నువ్వు మనోరమ హోటల్లో దిగిపో - నేను చాలా చిక్కుల్లో పడ్డాను" అన్నాడు.

"అది కాదు...." చెప్పబోయిందేదో.

"ఇంకేం చెప్పకు. వెంటనే వెళ్ళు" కసురుకున్నాడు.

కామేశ్వరి బయలుదేరింది కారులో....

కాని ఆమె చూడలేదు-యశస్వి ఒక టాక్సీలో తనను వెంటాడుతున్న విషయాన్ని.

---

నిన్న మొన్నటి గతం తుఫానుకు తడిసిన కళ్ళనుంచి ఇంకా ఆరని ఆశ్రువుల్ని గుర్తుచేసుకుంటూ నిద్రపోతున్న నానీని మరింత దగ్గరగా తీసుకుంది అనసూయ.

వేలెడు లేని పసికందు పెదవుల నుంచి ఎన్ని ముద్దు పలుకులు-

మధ్యాహ్నం మాట్లాడుతూనే ఏదో గుర్తుకొచ్చినట్టు జేబులోని రీలేదో తీశాడు.

ఏంటమ్మా అది అని అబ్బురంగా అడిగితే దాని పేరు 'నిజం' అన్నాడు... అది పోలీసులకివ్వాలని అర్థంకాని కథేదో చెప్పి అబ్బురంగా చూశాడు.

బహుశా సరాసరి దాన్ని తీసుకెళ్ళి పోలీసులకి ఇచ్చేదే -కాని నానీ చెప్పిన కథలో విన్న ఓ 'చావు' ఆమెను భయపెట్టింది.

ఆ భయం తాత్కాలికంగా వారించింది.

"ఇచ్చేద్దామమ్మా! పైగా అంకుల్ చచ్చిపోతూ మరీ మరీ చెప్పాడన్న మాట... దీని పేరు 'నిజం' కదా" అమాయకంగా అనగానే "అది నిజం కాబట్టే భయమమ్మా" అంటూ అనసూయ ఈ ప్రపంచంలో 'నిజం' తెచ్చే అనర్థాల గురించి ఏకరువు పెట్టలేదు.

చెప్పినా అర్థం చేసుకోని వయసది. అందుకే అప్పటికి మాట మార్చింది "అంకుల్ వచ్చాక ఇద్దాం".

"అంకుల్ అంటే...."

"నేను అమ్మనయితే అంకుల్ నీకు నాన్నలాంటివాడన్న మాట"

"మా నాన్న మంచోడు కాదుగా"

అర్థమయింది నానీ ఎలాంటి స్థితిలో వున్నదీ....

రీలు ఎక్కడ భద్రంగా వుంచిందీ నానీకి చెప్పలేదు.

కాని దాన్ని తప్పకుండా చేరాల్సిన చోటుకి చేర్చాలని మాత్రం నిర్ణయించుకుంది.

తలుపు తట్టిన చప్పుడు....

ఆలోచనల నుంచి తేరుకుంటూ పైకి లేస్తుంటే "అనసూయ తలుపు తియ్" మరోసారి వినిపించింది.

బోధపడింది వచ్చిందెవరో.

నిజానికి ఆమె మనసు సహకరించడం లేదు. నానీకి దూరం జరగాలని లేదు. కాని తప్పనిసరి.....

నిద్రపోతున్న నానీని పక్కగదిలో చాపపై పరుండబెట్టి తలుపు దగ్గరగా జారేసింది.

"ఏంటింతాలస్యం?" విసుగ్గా అన్నాడు లోపలికొచ్చిన వ్యక్తి.

అనసూయకి అర్థమైంది బాగా తాగున్నాడని "రెండు రోజులుగా దర్శనమే కరువైందేం" మాట మారుస్తూ చూసింది.

ఆ వ్యక్తి జవాబివ్వలేదు.

చాలా అసహనంగా ఆమెను పైకి లాక్కుంటూ మంచంపై వాలిపోయాడు.

విదిలించుకుంది.

మరో అరక్షణం ఆలస్యమైతే 'రీలు' రూపంలో వున్న నిజాన్ని అతడికందించేదే.

నానీ గదిలోకి వచ్చాడు "అంకుల్ వచ్చాడా అమ్మా?"

అనసూయ జవాబు చెప్పలేదు.

కాని తన ప్రియుడిగా ఆ గదిలో అడుగుపెట్టిన 'హరి' అప్రతిభుడవడాన్ని గమనించింది.

వెంటనే నానీ హరిని చూస్తూ వణికిపోవడాన్ని గుర్తించింది.

హరి వేగంగా జేబులోని రివాల్వర్ అందుకోవడంతో బాటు కసిగా ట్రిగ్గర్ నొక్కాడు.

ఒక సన్నని మూలుగు ఆ నిశరాత్రి ప్రతిధ్వనించింది...

ఓ అరక్షణం... అరక్షణంలో వెయ్యో వంతు అనసూయ ఆలస్యం చేసి వుంటే ఆ ఆక్రందన నానీది అయ్యుండేది.

కాని రివాల్వర్ నోటినుంచి తూటా జారకముందే ఆమె నానీకి అడ్డంగా నిలిచింది. అంతే.... మొదటి తూటా ఆమె పొట్టలోకి దూసుకు పోయింది.

కడుపులో అమ్మ ప్రేవు చీలిపోయినా ఆ లిప్తతో అనంతమైన సంతృప్తి.

ఎవరికీ ఆలి కాలేక, మరే బిడ్డకీ అమ్మ కాలేక అమ్మకానికి మాత్రమే సరిపడ్డ అ తనువు ఇక్కడ ఈ సంఘటనతో శాప విమోచనం పొందినందుకు సంతృప్తి పడుతూనే కొద్దిగా ముందుకి జరిగి హరి చేతిని పట్టుకుంది.

"పారిపో..... నాన్నా..... వెంటనే.... పా..రి...పో.... నానీ-" పెనుగులాడుతూనే పట్టు వదలకుండా అంటూంది.

ఆ ఘడియ అమ్మ చివరి దశను గుర్తుచేసింది.

"కాలిపోతున్న నన్ను తాకి నువ్వు రాలిపోకమ్మా" అంటూ అమ్మ చివరగా అన్న మాటలు జ్ఞప్తికొస్తుంటే కళ్ళనుంచి నీళ్ళు బొటబొటా రాలాయి. అమ్మలాంటి అనసూయ ఒడిలో తలపెట్టుకుని ఏడవాలనుంది కాని ధైర్యం చాల్లేదు. తూనీగలా జారిపోయాడు నానీ.

దొరికిన మరో అపురూపమైన అవకాశం అలా చేయిజారిపోయినందుకు హరి మండిపడుతూనే తనను ఒడిసిపట్టుకున్న అనసూయని దూరంగా నెట్టబోయాడు గాని ఆమె శక్తినింకా కూడగట్టుకుని అతణ్నాపే ప్రయత్నం చేస్తూనే వుంది.

నానీ పారిపోతున్నాడు, వాడితో బాటు అతి ముఖ్యమైన 'రీలు' తనకు దక్కకుండా పోతూంది.

అప్పారావు దృష్టిలో తను వెధవైపోతున్నాడు.

ఇక ఆలోచనలు హరిని మరింత రాక్షసుణ్ణి చేయగా చేతిలోని రివాల్వర్ మరోమారు నిప్పులు కక్కింది.

అంతే....

అనసూయ రక్తం ఈసారి ఫౌంటెన్‌లా అతడి ఒంటిపైకి తుళ్ళింది.

ఆమె నేలకొరిగిపోయింది పట్టు సడలిస్తూ....

ఇంకో రెండు క్షణాల్లో హరి రోడ్డుపైకి వచ్చాడు.

సరిగ్గా అప్పుడు చూశాడు- నానీ ఓ సందు మలుపు తిరగటాన్ని

హరి పాశుపతంలా వేగాన్ని పెంచాడు.

మరో నిస్సహాయపు నిశిరాత్రివేళ....

నానీ కన్నీళ్లను వర్షిస్తూ పరిగెడుతూనే వున్నాడు.

----

అప్పుడు సమయం రాత్రి పదకొండు గంటలు కావస్తూంది.

ఇదే వేళకి....

హోటల్ పంచవటిలోని తన గదిలో నుంచి....

యశస్వి రామసూరితో ఫోన్‌లో మాట్లాడుతున్నాడు.

"పగలంతా నానీకోసం గాలించాను రామసూరిగారు.... ప్రయోజనం లేకపోయింది. కాని.... రాందేవ్ చనిపోయిన రాత్రి హోం మినిష్టర్ అప్పారావుతో గెస్టుహౌస్‌లో గడిపిన ఆడదెవరో తెలుసుకున్నాను. ఈ వేళ ఉదయం ఆమె గెస్టుహౌస్ నుంచి బయటకొస్తుండగా అనుసరించాను కూడా" అన్నాడు.

"ఐసీ.... తెలివిగా ఆవిణ్ని ట్రేప్ చేస్తే...."

"లాభంలేదు. అది మామూలు ఆడది కాదు" క్లుప్తంగా చెప్పాడు ఆమె గురించి, నానీ కథలో ఆమె పాత్ర గురించీను.

"ఐ పిటీ మిస్టర్ యశస్వీ.... ఒక పోలీసాఫీసరు అయ్యుండి మీరూ, మహా మేధావులమని మురిసిపోయే మా జర్నలిస్టుల జాతి ఓ పసికందు ప్రాణాలను కాపాడలేని స్టేజ్‌లో వున్నామంటే ఇట్స్ రియల్లి అన్ ఎక్స్‌క్యూజబుల్...." బాధగా ధ్వనించింది రామసూరి కంఠం.

"మీకు తెలీదు రామసూరిగారూ! ఒక పోలీసాఫీసరుగా డిపార్టుమెంటులోని కొన్ని తీగల్ని కదిలించాను.... కాని....."

"డొంక కదలనంటూందంటారు..... ఐనో యశస్వీ.... దటీజ్ అప్పారావు.... మీ జాతి మనుషుల్లో చాలమంది అప్పారావు అనుచరులే"

"ఆ విషయాన్ని గ్రహించాను. అయినా కొద్దిపాటి సమాచారాన్ని సేకరించాను."

"ఏమిటది?"

"అర్థరాతివేళ కొన ఊపిరితో వున్న రాందేవ్‌ని హాస్పిటల్‌కి తరలించిన పోలీస్ పెట్రోలింగ్ వేన్‌లోని యస్సై ఆ స్పాట్‌కి సమీపంలో ఆగి ఉన్న ఓ జీప్‌ని చూశాడట. అది హరి అనబడే వ్యక్తిదంటాడు".

"గాడ్...." రామసూరి గొంతులో కొద్దిపాటి కలవరపాటు "మరి హరిని ఇంటరాగేట్ చేశారా?"

"అదే అడిగాను... జీప్ అక్కడ కనిపించినంత మాత్రాన అతడ్నెలా అనుమానిస్తాం అంటూ దాటేశాడు."

"తెలివైన ఫూల్ ఆ యస్సై ఎవడన్నా గానీ"

"యూ మీన్....!"

"యస్ మిస్టర్ యశస్వీ- రాందేవ్‌ని హత్య చేసే అవకాశమున్న ఒకే ఒక వ్యక్తి హరి గురించి నోరు జారి మళ్ళీ అంతలోనే తన చర్యనలా సమర్థించుకున్న ఆ యస్సై తప్పకుండా తెలివైనవాడు."

"అంటే....?"

"హరి మీరు విన్నట్టు ఓ మామూలు వ్యక్తి కాదు. పరమ కిరాతకుడిగా ఈ పట్టణంలో ప్రతివాడికీ తెలుసు.... అంతకు మించి హోం మినిష్టర్ అప్పారావుకి అతి ముఖ్యమైన అనుచరుడు".